క్లుప్తంగా

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్: పట్టణంలో కుంటలు, చెరువుల భూములను పలువురు కబ్జా చేశారని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి, డీబీఎం 16 ఉప కాలువ మాజీ వైస్ చైర్మన్ సొల్లు బాబు, కాంగ్రెస్ నాయకులు కొలిపాక శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో హనుమాన్ గుడి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల స్థలాలను విడిచిపెట్టకుండా కబ్జా చేశారన్నారు. హైదరాబాద్‌లో కబ్జాపై చర్యలు తీసుకున్నట్లుగానే హుజూరాబాద్‌లో ప్రభుత్వ స్థలాలను కబ్జాదారుల నుంచి కాపాడడానికి అధికారులు కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హైడ్రా తరహా చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్ మండలం, పట్టణంలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని జిల్లా, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో అక్రమ నిర్మాణాలపై హైడ్రా తరహాలో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశామని యువజన కాంగ్రెస్ నాయకుడు టేకుల శ్రావణ్ తెలిపారు. సోమవారం పట్టణంలో మాట్లాడారు. చెరువులు, కుంటలు ఆక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

హుజూరాబాద్: కేంద్ర ప్రభుత్వం శనివారం కేబినెట్ సమావేశంలో ప్రవేశ పెట్టిన భాగస్వామ్య పెన్షన్ పథకం స్థానంలో కొత్తగా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ని అమలు చేయాలనే నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ –సీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యు. మహేందర్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ..ఒక్క రూపాయి చెల్లించకుండానే సర్వీస్‌ను బట్టి యాభైశాతం ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

బీసీ కులగణన చేపట్టాలి

శంకరపట్నం: ప్రభుత్వం వెంటనే బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంఘం మండల అధ్యక్షుడు అఖిలాశ్ డిమాండ్ చేశారు. కేశవపట్నంలో సోమవారం వివిధ కులసంఘాలతో కలిసి మాట్లాడారు. కామారెడ్డిలో కాంగ్రెస్‌పార్టీ నిర్వహించిన బీసీ డిక్లరేషన్ అమలు చేయాలన్నారు. కులగణన చేయకుంటే దీక్షలు చేపడతామన్నారు. సమావేశంలో తిరుపతి, శ్రీనివాస్, ఆరీఫ్, సాగర్, సంపత్‌లు పాల్గొన్నారు.

ఈద్గా, కబరస్తాన్ సందర్శన

హుజూరాబాద్: హుజూరాబాద్ మజీద్ కాంప్లెక్స్‌లో గల ఈద్గా, కబరస్తాన్‌తో పాటు ఐదు మజీదుల చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రం చేయించాలని జామే మజీద్, ఈద్గా, కబరస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మున్సిపల్ అధికారులు, పాలకవర్గం సభ్యులను కోరారు. సోమవారం మజీద్ కాంప్లెక్స్ ప్రాంతంలోని ఈద్గా, కబ్రస్తాన్‌లను సందర్శించి మాట్లాడారు. వర్షాకాలం కావడంతో ఈద్గా, మసీదులు అస్తవ్యస్తంగా మారాయి, ఇప్పటికే విషజ్వరాలు ప్రబలుతున్నాయని, కబరస్తాన్‌లో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో పాములు సంచరిస్తున్నాయని ప్రమాదాలకు జరగకముందే స్పందించి మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ చొరవ తీసుకోవాలని అన్నారు.

సందల్ ఉత్సవం



గంధం తీసుకెళ్తున్న ముస్లింలు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో సోమవారం ముస్లింలు సందల్ ఉత్సవం నిర్వహించారు. గ్రామం నుంచి గంధం లేపనాన్ని అజ్రత్ జాకీర్‌సాహిత్‌బాబా దర్గా వద్ద సమర్పించారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

శంకరపట్నం: మండలంలోని కరీంపేట శివారులో సోమవారం విద్యుత్‌షాక్‌తో పాడిగేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన రైతు చింతం సాంబయ్య గేదె గడ్డి మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగలడంతో విద్యుత్‌షాక్ తగిలింది. సాంబయ్య కేకలు వేయడంతో సమీపంలోని రైతులు ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం అందించి విద్యుత్ సరాఫరా బంద్ చేయించారు. గేదె చనిపోయిన సమీపంలో మేక కళేబరం కనిపించడంతో విద్యుత్‌షాక్‌తో మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన రాచపల్లి సంపత్ అక్రమంగా ట్రాక్టర్‌తో ఇసుక తరలిస్తుండగా మండలంలోని కోరపల్లి గ్రామం వద్ద పట్టుకున్నామని, ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

ఖిలా.. పట్టించుకోకుంటే ఎలా..?

- పర్యాటకులను ఆకర్షిస్తున్న మొలంగూర్ ఖిలా ముఖద్వారం
- చారిత్రక ప్రాముఖ్యమున్న దూద్‌బావి
- మంజూరు కాని పర్యాటక నిధులు



ఖిలా ముఖద్వారం



మొలంగూర్ ఖిలా

శంకరపట్నం: మొలంగూర్ ఖిలాకు చారిత్రక నేపథ్యముంది. నిజాం రాజులు మొలంగూర్ గుట్టపై శత్రు దుర్భేద్యంగా కోటను నిర్మించినట్లు చరిత్రకారులు, స్థానికులు చెప్తారు. అలిగిరి మహరాజు మొలంగూర్ ఖిలా నిర్మించి పిరంగులు, కోనేరు, కోటను నిర్మించి హైదరాబాద్ కేంద్రంగా పాలన చేసినట్లు పూర్వికులు చెప్తుంటారు.

కమిషనర్ల సందర్శన

కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా పని చేసిన కమలాసన్‌రెడ్డి, బల్దియా కమిషనర్‌గా పని చేసిన శశాంక ఖిలాను సందర్శించారు. జిల్లాలోని పోలీస్ అధికారులను అప్పటి కేశవపట్నం ఎస్సై ఎల్.శ్రీను ఆహ్వానించి ఖిలా సందర్శించారు. దీంతో పర్యాటక కేంద్రంగా మారుతుందని గ్రామస్తుల్లో ఆశలు చిగురించాయి.

కేంద్ర పర్యాటక శాఖకు వినతి

మొలంగూర్ ఖిలాను పర్యాటక కేంద్రంగా చేసి నిధులు మంజూరు చేయాలని గత కేంద్ర ప్రభుత్వంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా పని చేసిన కిషన్‌రెడ్డికి గ్రామానికి చెందిన జక్కని సంజయ్ కుమార్ వినతిపత్రం అందించారు. కేంద్ర మంత్రితోపాటు పర్యాటక శాఖ అధికారులకు వినతిపత్రం అందించినా.. నయా పైసా మంజూరుకు నోచుకోలేదు.

సర్వాయిపేట తరహాలో..

రాష్ట్ర ప్రభుత్వం సర్వాయి పాపన్న జయంతి రోజు సైదాపూర్ మండలం సర్వాయిపేటకు రూ.4.5కోట్ల నిధులు మంజూరు చేసిన తరహాలోనే మొలంగూర్ ఖిలాకు రాష్ట్ర పర్యాటక శాఖ నుంచి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గుర్రం బండిపై దూద్‌బావి నీరు

మొలంగూర్ ఖిలా దిగువన దూద్‌బావి ఉంది. హైదరాబాద్‌కు గుర్రం బండిపై దూద్‌బావి నీటిని నిజాం రాజులు తీసుకెళ్లేవారని చరిత్రకారులు చెప్పుంటారు. ఒకప్పుడు హుజూరాబాద్ సీఐ రోజు క్యాన్‌లో దూద్‌బావి నీటిని తెప్పించుకునేవారు.

బొమ్మలమ్మగుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

గంగాధర: శతాబ్దాల చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్న మండలంలోని కురిక్యాల గ్రామ శివారులోని బొమ్మలమ్మగుట్ట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని చరిత్ర పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగెవేణి తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. చరిత్ర పరిరక్షణ యాత్రలో భాగంగా సోమవారం బొమ్మలమ్మగుట్టను సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రాచీన విద్యాకేంద్రాల్లో బొమ్మలమ్మ గుట్ట ఒకటని, త్రిభువన తిలక బసదిగా పిలువబడేదని ఇక్కడ చెక్కబడిన త్రిభాషా శాసనంలో తెలుగు కంద పద్యాల వల్ల తెలుగుభాషకు ప్రాచీన హోదా లభించిందన్నారు. ప్రాంతాన్ని పరిరక్షించుకోవాలిన్న బాధ్యత ప్రతి ఒక్కరిదని, సందర్శనకు వచ్చే



మాట్లాడుతున్న పరిరక్షణ సమితి సభ్యులు

పర్యాటకులకు ప్రభుత్వం మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పరిరక్షణ యాత్రలో కుందారపు సతీశ్, శివాల భాస్కర్, రామకృష్ణగౌడ్, తిరుపతి, అజయ్, శంకర్, సాయికృష్ణ పాల్గొన్నారు.

నేడు గంగాధర సహకార సంఘ భవనం ప్రారంభం

గంగాధర: మండల కేంద్రంలో నిర్మించిన గంగాధర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం ప్రారంభిస్తారని సంఘం చైర్మన్ దూలం బాలగౌడ్ తెలిపారు. గంగాధర సహకార సంఘం మండల కేంద్రంలో పాతతాలుకా నాటి భవనంలో అద్దెకు కొనసాగేదని, రైతుల సేవలతో పాటు సభ్యుల సంఖ్య పెరగడంతో కార్యాలయ నిర్వాహణ ఇబ్బందిగా మారింది, దీంతో కేంద్ర సహకార బ్యాంకు రుణంతో నూతన భవనం నిర్మించామని, సొంత భవనంలో రైతులకు మెరుగైన సేవలందిస్తామని చైర్మన్ పేర్కొన్నారు.



చొప్పదండి: కాట్నపల్లిలో ఉట్టికొట్టే వేడుకలు



రామడుగు: వెలిచాలలో విద్యార్థులు..



గంగాధర: గట్టుభూత్కూర్‌లో..

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు, కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయాల్లో వేడుకలు చేపట్టారు. అలాగే ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించగా యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తిపాటలు, నృత్యాలతో హోరెత్తించారు. అక్కడక్కడ మహిళల కోలాటం ఆకట్టుకుంది. – సాక్షి నెట్‌వర్క్



హుజూరాబాద్‌రూరల్ : చెల్పూర్‌లో..



చిగురుమామిడి: సుందరగిరిలో ...



తిమ్మాపూర్‌లో...

29 నుంచి మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాలు



ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో 29 నుంచి మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాలు నిర్వహించనున్నామని మండల విద్యాధికారి కె. శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. క్రీడల్లో పాల్గొనే బాలబాలికలు ఆధార్‌కార్డుతో పాటు జనన ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలని, ప్రభుత్వ, ప్రైవేట్, మోడల్ స్కూల్, కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు పాల్గొనవచ్చని మరింత సమాచారానికి మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి. సత్యనారాయణ 9440458494 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని బాలుర పాఠశాల మైదానంలో 29 నుంచి 31వ తేదీ వరకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పీడీ శ్రీలత సోమవారం ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు జనన ధ్రువీకరణ, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు వెంట తీసుకురావాలన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

శంకరపట్నం: రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ కళాకారుడు ఆకునూరి దేవయ్య ఇటీవల పోగొట్టుకున్నాడు. కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రవి సోమవారం బాధితుడికి ఫోన్ అందజేశారు. కేశవపట్నంలో ఆదివారం రూ.80వేల విలువ చేసే సెల్‌ఫోన్‌ను దేవయ్య పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాలను పరిశీలించి పోలీసులు ఫోన్‌ను స్వాధీనం చేసుకొని దేవయ్యకు ఇచ్చారు.



ఆర్టీసీ బస్సు-కారు ఢీ

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి దేవాలయం సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు-కారు ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాలు... కరీంనగర్ డిపోకు చెందిన బస్సు వరంగల్ నుంచి కరీంనగర్ వైపు వస్తోంది. హుజూరాబాద్ నుంచి బ్యాంక్ ఉద్యోగి కారులో కరీంనగర్ వైపు వస్తుండగా కొత్తగట్టు శివారులోని ఆలయం వద్ద బస్సు-కారును ఢీకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

- **పేకాటరాయుళ్ల అరెస్టు**

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో సోమవారం పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు సీఐ తిరుమల్ తెలిపారు. నలుగురి నుంచి రూ.5,400 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

- **ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పించాలి**

కరీంనగర్: ఖాళీ కాబోతున్న స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో ఎస్‌జీటీలకు ప్రమోషన్లు కల్పించాలని ఎస్టీటీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అలుమల్ల అనిల్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామదాసులు ప్రకటనలో పేర్కొన్నారు. జీహెచ్‌ఎం లెఫ్ట్ ఓవర్ ప్రమోషన్లు ఇస్తున్న కారణంగా వారి సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో బడుగు బలహీన వర్గాల నుంచి వచ్చిన పిల్లలు నష్టపోతారని తెలిపారు. 70 శాతం పోస్టుల్లో ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు.

కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి



మానకొండూర్‌రూరల్: మండలంలోని కొండపల్కల గ్రామం కూడలిలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో సోమవారం కొరివి కృష్ణస్వామి జయంతిని ముదిరాజ్‌లు ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ కులస్తులకు, సమాజానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈకార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రెసిడెంట్ బండి సంపత్, రాయమల్లు, గట్టు శ్రీధర్, పోచాలు, చంద్రయ్య, కులస్తులు పాల్గొన్నారు.



చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. చెట్ల కొమ్మలు వైర్లను తాకుతున్నాయి. విద్యార్థులు, క్రీడాకారులు, వాకర్లు నిత్యం సంచరించే క్రీడా మైదానంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయాలి. అనుకోని సంఘనలు జరగకముందే చెట్ల కొమ్మల నుంచి వెళ్లే విద్యుత్‌వైర్లను తొలగించాలి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
భూమయ్య, ఏఈ, ట్రాన్స్‌కో, చొప్పదండి, ఫోన్ నంబర్: 9441829275

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

సభ్యత్వ నమోదు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి



జమ్మికుంట: మాట్లాడుతున్న బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్మలాదేవి, తదితరులు

జమ్మికుంట: సభ్యత్వ నమోదు ప్రతి కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్మలాదేవి సూచించారు. పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్ అధ్యక్షతన సోమవారం సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఆరేళ్లకోసారి పార్టీ సభ్యత్వ నమోదు ఉంటుందని, సభ్యత్వం హక్కుగా భావించాలని, ప్రతి బూత్‌లో రెండు వందల వరకు సభ్యత్వాలు చేయించాలన్నారు. పదకొండు కోట్ల పైచిలుకు సభ్యత్వాలతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఉందని, ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్‌రావు, నాయకులు రవి, రాజేశ్, రాకేశ్, గణేశ్, మధు, స్వామి, రవీచందర్‌రెడ్డి, అశోక్, రాజు, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పార్టీ సంస్థాగత బలోపేతానికి సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కానున్నది బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణ అధ్యక్షుడు రాజు అధ్యక్షతన పట్టణంలోని శిశుమందిర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం నిర్వహించారు. బీజేపీతోనే వికసిత్ భారత్



హుజూరాబాద్: మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

సాధ్యమవుతుందని, జాతీయస్థాయి నుంచి భూత్ స్థాయి కార్యకర్త సభ్యత్వ నమోదులో పాల్గొనాలని, కార్యక్రమాన్ని పండగల నిర్వహించాలన్నారు. జిల్లాలో హుజూరాబాద్ సభ్యత్వ నమోదులో మొదటి స్థానంలో నిలిచేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, సుమన్, సభ్యత్వ నమోదు ప్రముఖ్ శ్రీనివాస్, సహప్రముఖ్‌లు శశిధర్, రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులు రాజు, విజయ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సంజీవ్, సంజీవరెడ్డి, శ్రీనివాస్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు సంపత్, పట్టణ కార్యదర్శి కొమరయ్య, శక్తి కేంద్ర ఇంచార్జ్ వెంకటేశ్ పాల్గొన్నారు.

నియామకం

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన మియాపురం లక్ష్మణాచారి బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దూలం కళ్యాణ్ సోమవారం నియామకపత్రం అందజేశారు. నియామకానికి సహకరించిన కేంద్రహోంశాఖ సహాయ మంత్రిబండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా



నియామకపత్రం అందుకుంటున్న లక్ష్మణాచారి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి, గుర్రాల వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ హర్షం వ్యక్తం చేశారు.

గద్దపాకను విభజించొద్దని ఆందోళన



గద్దపాక జీపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దళితకాలనీవాసులు

శంకరపట్నం: గద్దపాక గ్రామ పంచాయతీని విభజించి అంబేద్కర్‌నగర్ పేరిట ప్రత్యేక గ్రామ పంచాయతీ చేయొద్దని దళితకాలనీవాసులు సోమవారం జీపీ ఎదుట ఆందోళన చేశారు. ఇప్పటివరకు గద్దపాక జీపీలో అన్ని సామాజిక వర్గాలతో అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉన్నామని, దళితకాలనీని అంబేద్కర్‌నగర్ పేరిట వేరు చేసి అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం తగదన్నారు. దళితకాలనీలో ఇతర సామాజిక వర్గాలు లేకపోవడంతో ప్రత్యేక జీపీ చేయడం అంటే కులవివక్ష చూపడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. దళితకాలనీని గ్రామపంచాయితీగా చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఉమ్మడి గద్దపాక గ్రామ పంచాయతీగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో గ్రామానికి చెందిన రాచర్ల రాజయ్య, సోమిడి కొంరయ్య, మహేందర్, సాగర్, అంజి, నాగరాజు, అంజయ్య, సుధాకర్, జీవన్, అనిల్, తదితరులు ఉన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com